

కడెం.. డెడ్ స్టోరేజీ 8లో▸

నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలోని 68 వేల ఎకరాలకు సాగునీరందించే కడెం ప్రాజెక్టులో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరువైంది. ప్రస్తుతం 3.116 టీఎంసీలకు పడిపోయింది.



ఊరూరా 'బెల్టు' దందా 9లో▸

ఖానాపూర్ నియోజకవర్గంలో ఊరూరా.. వీధి వీధినా.. బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పట్టణంతోపాటు పల్లెల్లో చాలా మంది యథేచ్ఛగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
35.3 /24.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. పగలు వేడిగా, ఉక్కబోతగా ఉంటుంది. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన డీఐఈవో



పరీక్షకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈవో

ఖానాపూర్: పట్టణంలోని ఏఆర్ఎస్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాలను డీఐఈవో జాదవ్ పరుశురాం గురువారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలతోపాటు విద్యార్థుల హాజరు, పరీక్షల నిర్వహణ సరళిని పరిశీలించారు. ఏఆర్ఎస్ కళాశాలలో గురువారం 12 మంది గైర్హాజరు అయ్యారని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 15 మంది గైర్హాజరయినట్లు అధికారులు డీఐఈవోకు తెలిపారు. ఆయన వెంట డీఈసీ మెంబర్లు వెంకటేశ్వర్లు, రవికిరణ్, సీఎస్‌లు అబ్దుల్ హమీద్, రజిత, డీవోలు రాజన్న, శంకర్, ప్రిన్సిపాల్ బుక్యా రమేశ్‌నాయక్, సిట్టింగ్‌స్కాడ్ రహమాన్ ఉన్నారు.

ఉచిత శిక్షణ

నిర్మల్‌చైన్‌గేట్: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మూడు నెలలపాటు నిరుద్యోగులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనునట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వి.రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. జిల్లాలోని డిగ్రీ పాసైన ఎస్సీ నిరుద్యోగ యువతీ, యువకులు మార్చి 6వ తేదీ వరకు www.tsstudycircle.co.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫౌండేషన్ కోర్సులో భాగంగా గ్రూప్ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

నిర్మల్‌చైన్‌గేట్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మోడల్ స్పోర్ట్స్ స్కూల్స్, హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో 5వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల ఎంపికకు పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి జాదవ్ అంబాజీ తెలిపారు. ఎంపిక పోటీలు మార్చి 6న నిర్మల్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తామని తెలిపారు. 01.09.2013 నుంచి 01.09.2015 మధ్య జన్మించి జిల్లాలోని ఏదైనా పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థులు అర్హులని వివరించారు. పోటీలకు వచ్చే వారు పాఠశాల ప్రధానోపాధ్యాయుడి నుంచి బోనఫైడ్, అర్హత పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు. వివరాలకు జిల్లా క్రీడల అధికారి భుక్య రమేశ్‌ను 8919248320 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

నూతన ప్రవేశాల ప్రచార పోస్టర్లు విడుదల



పోస్టర్ విడుదలచేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నిర్మల్ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రచారానికి సంబంధించిన పోస్టర్లను ప్రిన్సిపాల్ భీమారావ్ అధ్యాపకులతో కలిసి గురువారం విడుదల చేశారు. ఈ సదర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఉత్తమ అర్హతలు, అత్యుత్తమ బోధన నైపుణ్యాలు ఉన్న అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. డిజిటల్ తరగతి గదులు, లాబ్స్ ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు ప్రవేశాలు పొంది, నాణ్యమైన విద్యను పొందాలని సూచించారు.

చిన్నారికి సన్మానం



సాన్విని సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్: కూచిపూడిలో ప్రతిభ చాటుతున్న నాలుగేళ్ల చిన్నారి సాన్విని నాయకులు సన్మానించారు. జిల్లా కేంద్రానికి చెందిన వైద్యులు శృతి, చంద్రప్రకాశ్‌మాల్వే దంపతుల కుమార్తె అయిన సాన్వి ప్రస్తుతం యూకేజీ చదువుతోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన గిన్నిస్ నృత్య ప్రదర్శనలో పాల్గొంది. పలు ప్రదర్శనల్లోనూ ప్రతిభను చాటింది. ఈనేపథ్యంలో స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో కాంగ్రెస్ నాయకులు, పెన్షనర్స్ సంఘం నాయకులు గురువారం సన్మానించారు. చిన్నారి ప్రతిభను డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, సీనియర్ నేత అల్లూరి మల్లారెడ్డి, పెన్షనర్ సంఘం జాతీయ కార్యదర్శి ఎంసీ.లింగన్న ప్రశంసించారు. సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు అప్పా గజేందర్, ముజ్గి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం..

- మెగా డీఎస్సీ ప్రకటన..
- జిల్లా అభ్యర్థుల్లో ఆనందం
- గత నోటిఫికేషన్ రద్దు..
- పోస్టులు పెంచుతూ తాజాగా విడుదల
- ఉమ్మడి జిల్లాలో 1,300 ఉపాధ్యాయ ఖాళీలు



ఖాళీలసంఖ్య పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలని డీఈవో రవీందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అభ్యర్థులు(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఉమ్మడి జిల్లాలోని బీఈడీ, డీఈడీ వంటి ఉపాధ్యాయ శిక్షణ కోర్సులు పూర్తి చేసిన వేలాది మంది అభ్యర్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు తీపికబురు అందించింది. రాష్ట్ర వ్యాప్తంగా 11,062 ఉపాధ్యాయ ఉద్యోగుల భర్తీకి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శాసనసభ ఎన్నికలకు ముందు విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ బుధవారం రద్దు చేసిన ప్రభుత్వం, తాజాగా పోస్టుల సంఖ్య పెంచుతూ డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీచేసింది. ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో గతంలో కంటే పోస్టులు పెరిగాయి. దీంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. వారి మోములో ఆనందం కనిపిస్తోంది.

గత నోటిఫికేషన్ ఇలా..

గతేడాది విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో నిర్మల్ జిల్లాకు 115, ఆదిలాబాద్ జిల్లాలో 275, కుమురంభీం జిల్లాకు 289, మంచిర్యాల జిల్లాకు 113 ఉపాధ్యాయ ఖాళీలు ప్రకటించారు. తాజాగా ఆ నోటిఫికేషన్ రద్దుచేసి ప్రభుత్వం పోస్టుల సంఖ్య పెంచింది. గురువారం విడుదల చేసిన కొత్త నోటిఫికేషన్ ప్రకారం.. నిర్మల్ జిల్లాకు- 342, ఆదిలాబాద్ జిల్లాకు 324, కుమురంభీం జిల్లాకు 341, మంచిర్యాల జిల్లాలో 288 ఉపాధ్యాయ ఖాళీలు చూపించారు.

సుదీర్ఘ నిరీక్షణ...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని చాలాకాలంగా ఎదురుచూస్తున్న డీఈడీ, బీఈడీ అభ్యర్థులు తాజా నోటిఫికేషన్‌తో హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం 2017లో నోటిఫికేషన్ ఇచ్చి కొన్ని ఖాళీలు భర్తీ చేశారు. తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడ లేదు. దీంతో కొంతకాలంగా అభ్యర్థులు నిరుత్సాహంలో ఉన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని దాదాపు 30 వేల మందికిపైగా అభ్యర్థులు డీఎస్సీ కోసం నిరీక్షిస్తున్నారు. తాజా నోటిఫికేషన్ విడుదల చేయడంతో జిల్లాలోని డీఈడీ, బీఈడీ అభ్యర్థుల సంఘం నాయకులు ఆనంద్ బాబు, తిరుమలేశ్, సురేశ్, శివకుమార్, గజేందర్, గణేశ్ తదితరులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

తీరనున్న ఉపాధ్యాయుల కొరత..

ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మొత్తం కలిపి దాదాపు 1,295 ఉపాధ్యాయ ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయనుంది. ఆయా జిల్లాల్లోని పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు అందుబాటులోకి రానున్నారు. కొన్నినెలల క్రితం స్కూల్ అసిస్టెంట్ల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియలో జిల్లా కేంద్రం నుంచి సుదూర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. వీటిల్లో బోధనకు ఆటంకం కలుగుతోంది. ఈ నేపథ్యంలో కొత్త డీఎస్సీలో ఉపాధ్యాయుల ఖాళీలను ప్రకటించడంతో ఉపాధ్యాయుల కొరత తీరుతుందని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఈసారి 'ప్రత్యేక' ఉపాధ్యాయులు...

ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ప్రత్యేక ఉపాధ్యాయులను ఈసారి ప్రభుత్వం నియమించనుంది. ప్రత్యేక అవసరాలు గల పిల్లలంటే శారీరక, మానసిక వికలాంగులు, ప్రజ్ఞా లబ్ధి తక్కువ గలిగిన విద్యార్థులు ఆయా పాఠశాలల్లో ఉండడంతో వారికోసం స్పెషల్ బీఈడీ, డీఈడీ చదివిన అభ్యర్థులతో ఈ ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇదే నోటిఫికేషన్‌లో వీటి ఖాళీలను ప్రత్యేకంగా చూపడంతో స్పెషల్ బీఈడీ, డీఈడీ పూర్తిచేసిన నిరుద్యోగ అభ్యర్థులకు ప్రయోజనం చేకూరనుంది. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ కేడర్లలో 'ప్రత్యేక ఉపాధ్యాయుల' నియామకానికి ఖాళీలను ప్రకటించారు.

గతఖాళీలు.. తాజా నోటిఫికేషన్‌లో పెరిగిన పోస్టులు..

జిల్లా	గత ఖాళీలు	తాజాగా పెరిగిన వాటితో కలిపి
నిర్మల్	115	342
ఆదిలాబాద్	275	324
మంచిర్యాల	113	288
కుమురంభీం	289	341

ఉమ్మడి జిల్లాలో సబ్జెక్టులవారీగా ఖాళీల వివరాలు..

జిల్లా	స్కూల్ అసిస్టెంట్	లాంగ్వేజ్ పండిత్	పీఈటీ	ఎస్జీటీ	స్కూల్ అసిస్టెంట్(ప్రత్యేక)	ఎస్జీటీ (ప్రత్యేక)	మొత్తం
నిర్మల్	70	04	04	236	05	23	342
ఆదిలాబాద్	74	14	02	209	06	19	324
మంచిర్యాల	70	16	03	176	05	18	288
కుమురంభీం ఆసిఫాబాద్	62	25	02	234	03	15	341



విద్యావ్యవస్థ మరింత బలోపేతం..



డీఎస్సీ నియామక ప్రక్రియతో జిల్లాలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరుతుంది. పాఠశాల విద్యావ్యవస్థ మరింత బలోపేతమవుతుంది. రానున్న విద్యా సంవత్సరం జూన్ ప్రారంభానికి నూతన ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఉండేలా నియామక ప్రక్రియ చేపట్టాలి.

– తోట నరేంద్రబాబు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు

సుదీర్ఘ నిరీక్షణకు తెర..



తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి కేవలం ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చింది. ఖాళీల భర్తీకి ఏళ్లుగా వినతులు విజ్ఞప్తులు చేస్తూ వచ్చాం. తాజాగా పోస్టులు పెంచుతూ నోటిఫికేషన్ జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఈ ఉపాధ్యాయుల భర్తీ ప్రక్రియను వేగవంతంగా, సజావుగా జూన్ నాటికి పూర్తి చేయాలి.

– ఎల్.తిరుమలేశ్, డీఈడీ అభ్యర్థుల సంఘం ప్రతినిధి

తాగునీటి సమస్య తలెత్తొద్దు

- ఉపాధి కూలీలందరికీ పని కల్పించాలి
- ధరణి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

భైంసారూరల్: రానున్న వేసవిలో భైంసా డివిజన్‌లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను దేశించారు. భైంసా ఎంపీడీవో కార్యాలయంలో డివిజన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మిషన్ భగీరథ నీరు ప్రతీ ఇంటికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. నర్సరీలు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలపై దృష్టి పెట్టాలన్నారు. వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. మండలస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని, జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కూలీకి పని కల్పించాలని తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ అధికారులు పంచాయతీ సెక్రటరీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ధరణి సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఆదేశించారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి...

ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. పథకాల అమలులో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతీ గ్రామంలో వందశాతం అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. మండలస్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితి తెలుసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో విజయలక్ష్మి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

టార్గెట్.. 100%

- పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి
- వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశాలు
- వడ్డీ బకాయిలపై 90 శాతం రాయితీ



నిర్మల్ మున్సిపల్ కార్యాలయం

భైంసాటౌన్: మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పన్నులు వందశాతం వసూలు చేయడమే లక్ష్యంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. ఈమేరకు అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ పన్నుల వసూలుపై దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని మూడు మున్సిపాలిటీల కమిషనర్లతోపాటు, గ్రామ పంచాయతీల అధికారులతో సమావేశాలు నిర్వహించారు. మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో నెల రోజుల్లో 100 శాతం పన్నుల వసూలు లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపల్ సిబ్బంది క్షేత్రస్థాయిలో తిరుగుతూ పన్నులు వసూలు చేస్తున్నారు. జిల్లాలో మూడు మున్సిపాలిటీల్లో కలిపి దాదాపు 40 నుంచి 50 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయి. గత బకాయిలు, వాటిపై వడ్డీలే అధికంగా ఉండడంతో పన్నుల వసూలులో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, గత బకాయిలు మార్చి నెలాఖరులోగా చెల్లించిన వారికి వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం కింద వడ్డీపై 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు పురపాలక శాఖ ప్రకటించింది. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో ఇలా...

జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో పన్నుల వసూలు పరిశీలిస్తే.. నిర్మల్‌లో మొత్తం పన్నుల వసూలు డిమాండ్ రూ.12.23 కోట్లు కాగా, వీటిలో రూ.4.18 కోట్లు వసూలయ్యాయి. భైంసా మున్సిపాలిటీలో డిమాండ్ రూ.7.29 కోట్లు కాగా, కేవలం రూ.2.05 కోట్లు వసూలు చేశారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో రూ.1.26 కోట్లు వసూలు డిమాండ్ కాగా, రూ.66.46 లక్షలు వసూలయ్యాయి. మార్చి 31 నాటికి వందశాతం వసూలు లక్ష్యం చేరుకోవాలని కలెక్టర్ తాజాగా ఆదేశించారు.

జిల్లాలో పన్నుల వసూలు ఇలా (రూ.కోట్లలో...)

బల్దియా	డిమాండ్	వసూలు	శాతం
నిర్మల్	రూ.12.23	రూ.4.18	34
భైంసా	రూ.7.29	రూ.2.05	46
ఖానాపూర్	రూ.1.26	రూ.0.66	52

సద్వినియోగం చేసుకోవాలి..

2022–23 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తి పన్ను బకాయి ఉన్నవారికి వడ్డీపై 90 శాతం రాయితీ అవకాశముంది. మార్చి 31లోపు చెల్లించినవారికి ఈ పథకం వర్తిస్తుంది. ఆస్తి పన్ను బకాయిదారులు సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి.

– వెంకటేశ్వర్‌రావు, కమిషనర్, భైంసా

బకాయిల వసూలుకు వన్‌టైం స్కీం...

బల్దియాల్లో పేరుకుపోయిన ఆస్తిపన్ను బకాయిల వసూలు పురపాలకశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తి పన్ను బకాయిలున్నవారికి ఓటీఎస్(వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం) కింద వడ్డీపై 90 శాతం రాయితీ అవకాశం కల్పించింది. మార్చి 31వరకు చెల్లించినవారికి మాత్రమే ఇది వర్తించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. 2023 మార్చి నాటికి ఆస్తిపన్ను, వడ్డీ, జరిమానాలు చెల్లించినవారికి కూడా ఈ పథకం వర్తిస్తుందని, అయితే సదరు 90 శాతం రాయితీని వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25)లో వచ్చే ఆస్తిపన్నులో రాయితీ కల్పించనున్నారు. ఆయా మున్సిపాలిటీల్లో అసలు కంటే బకాయిలు, వాటిపై వడ్డీలే అధికంగా ఉన్నాయి.

2022-23 వరకు పన్ను బకాయిలు, వడ్డీ ఇలా(రూ.కోట్లలో..)

బల్దియా	బకాయిలు	వడ్డీ
నిర్మల్	రూ.3.47	రూ.3.18
భైంసా	రూ.2.08	రూ.1.53
ఖానాపూర్	రూ.0.76	రూ.0.34

మున్సిపాలిటీల వారీగా పరిశీలిస్తే.. నిర్మల్‌లో 2022–23 వరకు పన్ను బకాయిలు రూ.3.47 కోట్లు ఉండగా, వీటిపై వడ్డీ రూ.3.18 కోట్లుగా ఉంది. భైంసా మున్సిపాలి టీలో రూ.2.08 కోట్లు పన్ను బకాయిలు ఉండగా, వాటిపై వడ్డీ రూ.1.53 కోట్లుగా ఉంది. ఖా నాపూర్‌లో రూ.76.56 లక్షలు పన్ను బకాయిలు, వాటిపై వడ్డీ రూ.34.1 లక్షలుగా ఉంది. ప్రస్తుతం గత బకాయిల వడ్డీపై 90 శాతం రాయితీ ప్రకటించిన నేపథ్యంలో పన్నులు సకాలంలో చెల్లించి వడ్డీ నుంచి మినహాయింపు పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

'క్యాంపస్'లో కదలిక..!



ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలు...

- బాసర ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ బదిలీ
- విధుల నుంచి రిలీవ్ అయిన సతీశ్‌కుమార్
- వర్సిటీ పరిస్థితిపై 'సాక్షి'లో వరుస కథనాలు
- ఇన్‌చార్జి వీసీ ఇకనైనా స్థానికంగా ఉంటారా..?

సాక్షి ఎఫెక్ట్..

నిర్మల్/భైంసా: ప్రభుత్వ పట్టింపులేనితనం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా బాసర ట్రిపుల్‌ఐటీలో ఇటీవల వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇదే విషయంపై ×సాక్షి౯ వరుస కథనాలను ప్రచురిస్తుండటంతో ట్రిపుల్‌ఐటీలో కదలిక మొదలైంది. ఏకంగా వర్సిటీ డైరెక్టర్ పెద్దపల్లి సతీశ్‌కుమార్‌ను బదిలీ చేసింది. ఈమేరకు ఆయన గురువారం తన విధుల నుంచి రిలీవ్ అయ్యారు. తన మాతృసంస్థ అయిన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా బాధ్యతలలో కొనసాగనున్నారు. వర్సిటీలో అందుబాటులో ఉండే డైరెక్టర్ బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఎప్పుడో ఒకసారి వర్సిటీకి వచ్చే ఇన్‌చార్జి వీసీ ఇక నుంచి ఇక్కడే ఉంటారా.. లేక కొత్త డైరెక్టర్‌ను నియమిస్తారా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఆందోళనల సమయంలో..

ఏళ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రెండేళ్లక్రితం వర్సిటీ విద్యార్థులు ఆందోళనకు దిగారు. వారంపాటు వెనక్కు తగ్గకుండా పోరాడారు. అప్పుడున్న పరిస్థితుల్లో నాటి రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన సమయంలోనే 2022, జూన్ 16 న ఓయూ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్‌ను ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్‌గా నియమించింది. అప్పటి నుంచి దాదాపు 21 నెలలు ఆయన ట్రిపుల్‌ఐటీకి సేవలు అందించారు. అప్పటి ప్రభుత్వం, ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ సూచనల మేరకు పలు చర్యలు చేపట్టారు.

స్థానికంగా ఉండని వీసీ..

2022లో విద్యార్థుల ఆందోళన సమయంలోనే అప్పటి ప్రభుత్వం వీసీగా ఉన్న ఐఏఎస్ అశోక్‌ను తొలగించి, ఉన్నతవిద్యామండలి వైస్‌చైర్మన్‌గా ఉన్న వెంకటరమణను ఇన్‌చార్జి వీసీగా నియమించారు. ఆందోళనలు కొనసాగినంత కాలం ఆయన స్థానికంగా అందుబాటులో ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాద్ నుంచి వస్తూపోతూ విధులు సాగించారు. ఉన్నతవిద్యామండలి బాధ్యతలు కొనసాగడంతో కొంతకాలంగా ఇన్‌చార్జి వీసీ వర్సిటీపై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు పెరిగాయి. ఈక్రమంలో స్థానికంగా ఉండే డైరెక్టర్‌పైనే భారం పడింది. వర్సిటీలో ఎప్పుడూ అందుబాటులో ఉండే డైరెక్టర్‌కు చెక్‌పవర్ లేకుండా చేశారని ఈ విషయంలోనూ ఇన్‌చార్జి వీసీ, డైరెక్టర్ మధ్య సయోధ్య లేకుండా పోయిందన్న విమర్శలూ ఉన్నాయి. వీటితోపాటు ఇటీవల విద్యార్థిని ఆత్మహత్య, విద్యార్థులకు మత్తుపదార్థాలు అందుతున్నట్లు ఆరోపణలు రావడంతో మళ్లీ అందరి చూపు ట్రిపుల్‌ఐటీపై పడింది. ఈక్రమంలో డైరెక్టర్‌పై వేటుపడటం చర్చనీయాంశంగా మారింది.

ఉన్నత సేవలు అందించారు..

ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ ఉన్నత సేవలు అందించారని ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. డైరెక్టర్ సతీశ్‌కుమార్ గురువారం బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఈసందర్భంగా ఆయన అందించిన సేవలను వెంకటరమణ గుర్తుచేశారు. సతీశ్‌కుమార్ మాట్లాడుతూ తనకు సహకరించిన అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు, పరిపాలన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిష్ఠాత్మక బాసర ట్రిపుల్‌ఐటీలో పనిచేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందని పేర్కొన్నారు.



సతీశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అధికారులు

ఈసందర్భంగా ఆయనను ఇన్‌చార్జి వీసీ, వర్సిటీ అధ్యాపకులు, అధికారులు శాలువాలతో సత్కరించారు. అసోసియేట్ డీన్స్, పరిపాలన విభాగం అధికారులు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలకు కృషి

కుంటాల: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కృషిచేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కల్లూర్ కేజీబీవీ పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. మార్చి 1 నుంచి 12 వరకు ప్రీఫైనల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. తరగతిలో విద్యార్థులకు పాఠాలు బోధించి వారి సందేహాలను నివృత్తి చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం అవసరమయ్యే మందులు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్యాధికారికి సూచిస్తానని తెలిపారు. ఆయన వెంట సెక్టోరియల్ అధికారులు నర్సయ్య, శ్రీదేవి, ఎస్‌వో సువర్ణ ఉన్నారు.

ఉపాధ్యాయుడి విచారణ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సీహెచ్.బాపయ్యను ఎంఈవో మధుసూదన్ గురువారం విచారణ చేశారు. పెంబి మండలంలోని అంగన్వాడీ టీచర్లను సమాచారం హక్కు చట్టం ద్వారా వివరాల పేరుతో ఉపాధ్యాయుడు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. వెంటనే విచారణ చేయాలని కలెక్టర్‌తోపాటు జిల్లా విద్యాధికారి ఆదేశించారు. ఈమేరకు విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఎంఈవో తెలిపారు.

ప్రారంభమైన ఇంటర్ సెకండియర్ పరీక్షలు

- తొలిరోజు 6, 227 మంది విద్యార్థుల హాజరు
- 279 మంది గైర్హాజరు

నిర్మల్ రూరల్: ఇంటర్ సెకండియర్ పరీక్షలు జిల్లాలో గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 23 పరీక్ష కేంద్రాలను ఏర్పా టు చేశారు. 6,506 మంది విద్యార్థులకుగాను తొలిరోజు 6,227 మంది హాజరయ్యారు. 279 మంది గైర్హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 5,531 మంది విద్యార్థులకు 5,348 మంది హాజరవగా, 183 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 975 మంది విద్యార్థులకుగాను, 879 మంది హాజరయ్యారు. 96 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో పరశురాం తెలిపారు.

క్లుప్తంగా

నిజాయతీ చాటుకున్న ఆలయ సిబ్బంది



బ్యాగు అప్పగిస్తున్న ఆలయ సిబ్బంది

భైంసా(ముధోల్): హైదరాబాద్‌కు చెందిన ఝాన్సీలక్ష్మి గురువారం బాసర సరస్వతీ అమ్మవారి దర్శనానికి వచ్చి ఆలయ ప్రాంగణంలో బ్యాగు మర్చిపోయారు. అందులో 30 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.6వేల నగదు ఉన్నాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది బ్యాగును గమనించి ఉన్నతాధికారులకు అందించారు. అందులో ఉన్న ఐడీ ఆధారంగా భక్తురాలికి ఫోన్ చేశారు. ఆలయ సూపరింటెండెంట్ శివరాజ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ భక్తురాలికి బ్యాగును తిరిగి అప్పగించారు.

బాసరలో ఆర్‌అండ్‌బీ ఈఈ పూజలు



ఆలయంలో ఆర్‌అండ్‌బీ ఈఈ మోహన్

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని ఆర్‌అండ్‌బీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోహన్ నాయక్ గురువారం దర్శించుకున్నారు. ఆలయంలో అధికారులతో కలిసి అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ క్షేత్రపర్యటనలో భాగంగా బాసర గ్రామంలోని బొర్రగణేశ్ ఆలయం నుంచి మహాలక్ష్మి ఆలయం, పాపహరేశ్వర ఆలయం, దత్తాత్రేయ ఆలయం నుంచి సరస్వతీ అమ్మవారి ఆలయం వరకు బైపాస్ సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రూ.6 కోట్లతో ఈ సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. బైపాస్ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే మండల కేంద్రానికి వచ్చే ప్రజల ఇబ్బందులు తీరుతాయని పేర్కొన్నారు.


రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

భైంసారూరల్: భైంసా–నిర్మల్ జాతీయ రహదారిపై మాటేగాం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భైంసాలోని గోపాల్‌నగర్‌కు చెందిన విఠల్, ప్రీతమ్(12)తో కలిసి ద్విచక్ర వాహనంపై మాటేగాం వైపు వెళ్తుండగా వానల్పా డ్ నుంచి భైంసావైపు వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. బాలునికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తీవ్రగాయాలపాలైన విఠల్ చికిత్స పొందుతున్నాడు. భైంసారూరల్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.

గుడుంబా పట్టివేత

పెంబి: ఎక్సైజ్ ఎస్సై వసంత్ రావు ఆధ్వర్యంలో పెంబి మండల కేంద్రంతో పాటు మందపల్లి, పెంబితాండ, ఇటిక్యాల్‌లో గురువారం తనిఖీలు నిర్వహించారు. పెంబిలో పెండల భీమేష్ వద్ద ఆరు లీటర్ల గుడుంబా లభించడంతో గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కడెం.. డెడ్ స్టోరేజీ



నీళ్లు లేక వెలవెలబోతున్న ప్రాజెక్ట్

- 3.116 టీఎంసీలకు చేరిన నీటి మట్టం
- గతేడాది 688.075 అడుగులు
- ప్రస్తుతం 677.475 అడుగులు

ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700 అడుగులు(7.603 టీఎంసీ)
వరద గేట్లు 18, కాలువలు 2
ఆయకట్టు 68,150 ఎకరాలు(ఖరీఫ్)
డిస్ట్రిబ్యూటరీలు 42

కడెం: నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలోని 68 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే కడెం ప్రాజెక్టులో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరువైంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 7.603 టీఎంసీలు. ప్రస్తుతం 3.116 టీఎంసీలకు పడిపోయింది. వానాకాలం కడెం, దస్తురాబాద్, జన్నారం, దండెపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల్లో 68 వేల ఎకరాలకు సాగునీరు అందించింది. నవంబర్, డిసెంబర్ నెలల్లో వర్షాలు కురవకపోవడం, ప్రాజెక్టు గేటు కొట్టుకుపోవడంతో నీటిమట్ట పడిపోయింది. యాసంగి పంటలకు నీరందించలేదు. ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ క్రమంగా తగ్గుతూ డెడ్ స్టోరేజీకి చేరువైంది. గతేడాది ఫిబ్రవరి 28న, 688.075 అడుగుల నీటిమట్టం ఉండగా, ఈ ఏడాది ఫిబ్రవరి 28న 677.475 అడుగులుగా ఉంది.

భగీరథకు నీరందేనా?

మిషన్ భగీరథ పథకం ద్వారా కడెం, ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్ మండలాలకు నీరందించాల్సి ఉంది. మిషన్ భగీరథకు ప్రతీరోజు 09 క్యూసెక్కుల నీరు అవసరం. ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ క్రమంగా తగ్గుతుండడంతో మిషన్ భగీరథ ఇంటెక్‌వెల్‌కు పూర్తి స్థాయిలో నీరందుతుందా? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నీటి మట్టం తగ్గుతోంది..



కడెం ప్రాజెక్టులో నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. డెడ్ స్టోరేజీ లెవెల్ 675 అడుగులు. ప్రస్తుతం 677 అడుగుల నీరు ఉంది. ప్రాజెక్టు మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఇటీవలే ప్రభుత్వం రూ.5.46 కోట్లు విడుదల చేసింది. టెండర్ పూర్తి కాగానే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– బోజదాసు, కడెం ప్రాజెక్టు డీఈ

టెండర్లు పూర్తయ్యేనా?

కడెం మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం జనవరి 29న, రూ.5.46 కోట్లు మంజూరు చేసింది. మొదటిసారి టెండర్లు పిలవగా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. రెండోసారి మళ్లీ టెండర్లు ఆహ్వానించారు. టెండర్ ప్రక్రియ ముగిసి వానాకాలం లోగా మరమ్మతులు పూర్తి చేస్తేనే కడెం ప్రాజెక్టు ఇబ్బందుల నుంచి బయటపడుతుంది. లేదంటే రెండేళ్లుగా వానాకాలంలో వచ్చినట్లు భారీ వరదలు వస్తే ముప్పు తప్పదు. గతంలో విడుదల చేసిన రూ.కోటితో ప్రస్తుతం వరద గేట్ల కౌంటర్ వెయిట్లు, స్పిల్‌వే కింద భాగం మరమ్మతులు చేస్తున్నారు.

యాసంగి బీడే..

వానాకాలంలో 68 వేల ఎకరాలకు సాగు నీరందించిన కడెం, యాసంగిలో కుడి, ఎడమ కాలువల ద్వారా కేవలం 25 వేల ఎకరాలకు సాగు నీటిని అందిస్తుంది. ఏడాది కంటే పది అడుగుల మేర నీటిమట్టం తగ్గడంతో ఈ యాసంగి పంటలకు సాగు నీరు ఇవ్వలేమని ప్రాజెక్ట్ అధికారులు ప్రకటించారు. బావులు ఉన్న రైతులు పంటలు సాగు చేయగా, కడెం నీటి విడుదల లేక వేల ఎకరాలు బీళ్లుగా మారాయి. కాలువలు, చెరువులపై ఆధారపడి పంటల సాగు చేసిన రైతులు సాగు నీటి కోసం తిప్పలు పడుతున్నారు. కడెం మండలం కన్నాపూర్, కొండుకూర్, బెల్లాల్, గ్రామ రైతులు కుడికాలువపై ఆధారపడి పంటలు సాగు చేశారు. ప్రాజెక్ట్‌లో నీటిమట్టం పడిపోవడంతో కాలువ నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.

‘గురుకుల’ ఫలితాల్లో ప్రతిభ

- రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన గణేశ్
- రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయినా.. ఆత్మస్థైర్యంతో ముందుకు



గణేశ్



బెల్లపు నగేశ్



అవినాశ్



అర్జున్



రజిత



కార్యం సుప్రియ

ఆదిలాబాద్‌టౌన్/తాంసి: కృషి, పట్టుదల ఉంటే అనుకున్నది సాధించవచ్చని నిరూపించారు జిల్లాకు చెందిన బోడ్కుంటవార్ గణేశ్, బెల్లపు నగేశ్, నడికుంట్ల అవినాశ్. గణేశ్ 2018లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కాలు కోల్పోయినప్పటికీ వెనుకడుగు వేయకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాడు. బుధవారం వెలువడిన గురుకుల డిగ్రీ ఫలితాల్లో ఆంగ్ల సబ్జెక్టుకు సంబంధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. బేల మండల కేంద్రానికి చెందిన ఈయన ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రభుత్వ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. గ్రూప్స్, సివిల్‌కు సన్నద్ధమవుతున్న తరుణంలో డిగ్రీ గురుకుల నోటిఫికేషన్ రావడంతో పరీక్ష రాశాడు. లెక్చరర్‌గా మరోసారి సర్కారు కొలువు దక్కించుకున్నాడు. తాంసి మండల కేంద్రానికి చెందిన బెల్లపు నగేశ్ డిగ్రీ లెక్చరర్‌గా, భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన నడికుంట్ల అవినాశ్ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. నగేశ్ ప్రస్తుతం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సైనిక్ పాఠశాలలో ఉద్యోగం చేస్తున్నాడు. నడికుంట్ల అవినాష్ సైతం గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లోప్ ప్రతిభ కనబరిచి ఎకనామిక్స్ విభాగంలో జూనియర్ లెక్చరర్ గా ఉద్యోగం సాధించాడు. ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి బస్తీకి చెందిన దేవునూరి అర్జున్ ఎంకామ్, బీఈడీ పూర్తి చేసి గురుకుల టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ పోటీ పరీక్షలు రాశాడు. పీజీటీ సోషల్‌లో రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంకు సాధించాడు. ఫిబ్రవరి 15న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రం అందుకున్నాడు. గురువారం వెలువడిన గురుకుల జూనియర్ కామర్స్ లెక్చరర్ ఫలితాల్లో టీజీటీ సోషల్‌లో 185 మార్కులు సాధించి లెక్చరర్‌గా రెండో ఉద్యోగం సొంతం చేసుకున్నాడు. అంతకు ముందు 2019లో గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఉద్యోగానికి ఎంపికై వారం రోజుల్లోనే రాజీనామా చేశాడు.

రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు

నిర్మల్ రూరల్: నిర్మల్ రూరల్ మండలం నీలాయిపేట గ్రామానికి చెందిన మట్టె భూమన్న– రాజవ్వల కుమార్తె మట్టె రజిత గురువారం వెలువడిన గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించింది. కొన్ని రోజుల క్రితం వెలువడిన పీజీటీ ఫలితాల్లోనూ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ ఉద్యోగం కూడా సాధించింది. ఒకే నెలలో రెండు ఉద్యోగాలు రావడంతో ఆనందంగా ఉందని రజిత పేర్కొంది. ప్రభుత్వ పాఠశాలలో చదివి, తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతో విజయం సాధించానని రజిత తెలిపారు.

మెదన్‌పూర్ యువతి..

కుంటాల: మండలంలోని మెదన్‌పూర్ గ్రామానికి చెందిన కార్యం సుప్రియ గురుకుల నియామక బోర్డు వెల్లడించిన ఫలితాల్లో మొదటి ప్రయత్నంలోనే జూనియర్ లెక్చరర్, పీజీటీ ఉద్యోగాలకు ఎంపికైంది. ఇంగ్లిష్ సబ్జెక్టులో రెండు ఉద్యోగాలు సాధించింది. తన మామయ్య కార్యం పెద్దరాజన్న, భర్త రాజు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఈ విజయం సాధ్యమైందని కార్యం సుప్రియ తెలిపారు.

మామిడిగూడ పాఠశాల హెచ్‌ఎం సస్పెన్షన్

కై లాసనగర్: ఆదిలాబాద్ రూరల్ మండలం మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలో పీజీ హెచ్‌ఎం ఏ.అశోక్ సస్పెండ్ అయ్యారు. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న తొడసం మహేశ్వరి గత నెల 27న రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. ఈ ఘటనను నిరసిస్తు ఆదివాసీ సంఘాలు ఆందోళన చేపట్టాయి. దీనిపై జిల్లా దళి తాభివృద్ధిశాఖ అధికారి సునీత కుమారిని కలెక్టర్ విచారణ అధికారిగా నియమించారు. వి ద్యార్థినికి వైద్యచికిత్సను అందించడంలో సద రు హెచ్‌ఎం నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లుగా డీఎస్సీడీవో అందించిన నివేదిక ఆధారంగా హెచ్‌ఎంను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పద్మశ్రీ కనకరాజుకు చికిత్స

- జైనూర్ నుంచి నిర్మల్ వరకూ వచ్చి..
- చికిత్స చేయించుకున్న గుస్సాడీ కళాకారుడు



కనకరాజు దంపతులను సన్మానిస్తున్న వైద్యులు

నిర్మల్: గుస్సాడీ నృత్యానికి జాతీయస్థాయి గుర్తింపు తీసుకువచ్చి, 2019లో పద్మశ్రీ అవార్డు అందుకున్న ఉమ్మడిజిల్లావాసి కనకరాజు ఓ సామాన్యుడిగా వచ్చి నిర్మల్‌లో వైద్యచికిత్స చేయించుకున్నారు. సదరు ఆస్పత్రి యాజమాన్యం ఉచితంగా వైద్య సేవలందించడంతో పాటు ఘనంగా సన్మానించింది. వివరాలను నిర్మల్ జిల్లాకేంద్రంలోని స్వప్న మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు నాళం శశికాంత్ గురువారం వెల్లడించారు. కుమురంభీం జిల్లా జైనూర్ మండలానికి చెందిన కనకరాజు కొంత కాలంగా ఊపిరితిత్తులు, యూరాలజీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. మూడురోజుల క్రితం స్వప్నమల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చారు. ఆయనను పరీక్షించిన జనరల్ సర్జన్లు మల్లేశ్, శశికాంత్ ఉచితంగా ఆపరేషన్ చేశారు. పూర్తిగా కోలుకోవడంతో గురువారం ఆస్పత్రి వైద్యులంతా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు నిఖిల్, స్వప్న, జగన్ పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లింగ్‌లో కి‘లేడీ’

- ఒడిశా నుంచి తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు సరఫరా
- మాన్కాపూర్ వద్ద పట్టుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీమేశ్

గుడిహత్నూర్(బోథ్): గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు సీఐ భీమేశ్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి ప్రాంతం నుంచి తెలంగాణ మీదుగా మహారాష్ట్రలోని ముంబై తదితర ప్రాంతాలకు పెద్ద మొత్తంలో గంజాయి రవాణా అవుతోందని యాంటీ నార్కొటిక్ బ్యూరో రెండు నెలలుగా నిఘా పెట్టింది. ఈ క్రమంలో సమాచారం అందుకున్న అధికారులు స్మగ్లర్‌ను పట్టుకోవడానికి యాక్షన్ మొదలు పెట్టారు. గురువారం స్థానిక ఎస్సై ఇమ్రాన్‌కు సమాచారం అందించారు. దీంతో పోలీసులు మఫ్టీలో ఆ ప్రాంతంలో కాపు కాశారు. మండలంలోని మాన్కాపూర్‌లోని ఓ కూల్‌డ్రింక్ షాపు వద్ద నిలిచి ఉన్న జుపిటర్ స్కూటీని తీసుకెళ్లేందుకు వచ్చిన మహిళను అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. దీంతో స్కూటీ డిక్కీలో 28 కిలోల గంజాయి లభ్యమైంది. దీని విలువ సుమారు రూ.8 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. సదరు మహిళ మహారాష్ట్రకు చెందిన వాశిం జిల్లాకు చెందిన మోహిని సంతోష్ ఠాక్రే అని, గతంలో ఇదే రూట్లో మూడు సార్లు స్మగ్లింగ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరిలో అర్జున్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రలోని వాశింకు చెందిన నితిన్ అనే వ్యక్తికి విక్రయిస్తోంది. అయితే 700 కి.మీ. దూరాన్ని స్కూటీపై ఒంటరిగా అటవీ మార్గం గుండా ఎవరికీ అనుమానం రాకుండా స్మగ్లింగ్ చేస్తుండడంతో స్థానికులు విస్తుపోయారు. మోహినిపై కేసు నమోదు చేసి నిందితురాలిని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై ఇమ్రాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల ‘పోస్ట్’

- తపాలా సేవలు విస్తరించినా మెరుగుపడని సౌకర్యాలు
- శిథిల భవనాల్లోనే కొనసాగింపు
- అధ్వాన్నంగా ఉద్యోగుల క్వార్టర్లు
- ఎక్కడా కానరాని సీసీ కెమెరాలు
- అద్దె భవనాల్లో బ్రాంచ్ పోస్టాఫీసులు



బెల్లంపల్లి సబ్ పోస్టాఫీసు భవనం

బెల్లంపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పోస్టాఫీసులు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. దశాబ్దాలుగా సౌకర్యాల కల్పనకు నోచుకోవడం లేదు. పురాతన భవనాలు తప్పా కొత్త భవనాలకు మోక్షం కలగడం లేదు. అరకొర సౌకర్యాలు, అవస్థలతో పోస్టల్ ఉద్యోగులు అనివార్యంగా విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలకు పలు రకాల సేవలు అందిస్తున్న పోస్టాఫీసులను పట్టించుకునే వారే కరువయ్యారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సేవలను విస్తరించిన అధికారులు అందుకు తగిన సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

ఇవీ పరిస్థితులు

ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, మంచిర్యాలలో రెండు హెడ్ పోస్టాఫీసులు, వీటికి అనుబంధంగా 65 సబ్ పోస్టాఫీసులు ఉన్నాయి. వీటిలో సగానికి పైగా పక్కా భవనాలు లేవు. ప్రస్తుతం నిర్వహిస్తున్న భవనాలు అత్యంత శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలి పోతాయో తెలియని పురాతన భవనాల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. పైకప్పు ఊడి పోయి కింద పడుతున్న భవనాలకు దశాబ్దాల నుంచి తాత్కాలిక మరమ్మతులు చేయించడం తప్పా కొత్త భవనాల ఊసెత్తక పోవడంతో పోస్టాఫీసుల కళ మారడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎనిమిదింటికి పక్కా భవనాలు ఉండగా మిగతా వాటిని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్న హెడ్‌పోస్టాఫీసు భవనం సరిగా లేకపోవడంతో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న పోస్టాఫీసు భవనం పరిస్థితి ఈ తీరుగా ఉంటే మిగిలిన వాటి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

గ్రామీణ ప్రాంతాల్లో...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 525 బ్రాంచ్ పోస్టాఫీసులు ఉన్నాయి. వీటిలో దేనికీ సొంతగూడు లేదు. గ్రామాల్లో నివాసం ఉంటున్న పోస్టుమ్యాన్‌ల ఇళ్లలో, అద్దె భవనాల్లో వీటిని కొనసాగిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా వీటి రూపురేఖలు మారక పోవడంతో అత్యంత దయనీయస్థితిలో ఉన్నాయి. గ్రామాల్లో తపాలా సేవలు గతంలో కన్న ఎంతగానో విస్తరించినప్పటికీ సరైన సౌకర్యాలు లేక పోస్టల్ సిబ్బంది, గ్రామీణులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు దాపురించాయి.

సిబ్బంది క్వార్టర్లు

పోస్టల్ ఉద్యోగులు, సిబ్బంది కోసం పోస్టాఫీసు ఆవరణలో దశాబ్దాల క్రితం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా క్వార్టర్ల నిర్మాణం చేశారు. ఇరుకిరుకుగా గదులు ఉండడంతో జీవనం సాగించడానికి ఉ ద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయని ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు ఆడుకోవడానికి ఖాళీ స్థలం లేక నాలుగు గోడల మధ్య, టీవీల ముందు కాలం గడుపుతున్నారు. ఆట విడుపు లేక మానసిక వేదనకు గురవుతున్నారు.

ఊసేలేని సీసీ కెమెరాలు

మారుతున్న కాలానికి అనుగుణంగా అన్నిరంగాల్లోనూ మార్పులు వస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు ఇతర విభాగాల్లో తగినన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్థిక లావాదేవీలు జరిగే బ్యాంకులు, ఇతర సంస్థల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతగానో ఉంది. కానీ పోస్టాఫీసుల్లో ఆ ఊసేలేకుండా పోయింది. సీసీ కెమెరాల ఆవశ్యకతను తపాలా శాఖ గుర్తించడం లేదు. ఒక్కో పోస్టాఫీసులో రోజువారీగా కనిష్ఠంగా రూ.20 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.కోటి వరకు ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయినా ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోక పోవడంతో ఏదైనా ఘటన జరిగినా, అపరిచితులు పోస్టాఫీసు ప్రాంగణానికి వచ్చినా గుర్తు పట్టని పరిస్థితులు ఉన్నాయని పోస్టల్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వస్తోంది. అదేతీరుగా శిథిలావస్థకు చేరుకున్న భవనాలకు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న పోస్టాఫీసులకు నిధులు మంజూరు చేయించి పక్కా భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగుల క్వార్టర్ల కు తగిన సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

భైంసారూరల్(ముధోల్): మండలంలోని మిర్జాపూర్ గ్రామానికి చెందిన ఎడ్కే గంగాసాగరబాయి (44) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గంగాసాగరబాయి కుమారుడు రెండేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురైంది. ఎప్పుడూ కుమారుడిని తలచుకుంటూ బాధపడుతుండేది. బుధవారం మహిళ భర్త గంగాధర్ పని నిమిత్తం ఇంటినుంచి బయటకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

మనోవేదనతో వ్యక్తి ...

బేల(ఆదిలాబాద్): అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై డి.రాధిక తెలిపిన వివరాల ప్రమారం మండలంలోని డోప్టాల గ్రామానికి చెందిన బండి సురేష్ (55)ఎనిమిదేళ్లుగా నరాల బలహీనతతో బాధపడుతున్నాడు. మహారాష్ట్రతో పాటు వివిధ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చూపించినా వ్యాధి నయం కాకపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. గురువారం ఉదయం ఇంటి పైకెక్కి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని కుమారుడు బండి సంగీత్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

బేలలో యువకుడు..

బేల(ఆదిలాబాద్): మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మంత్రి అక్షయ్ (25) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై డి.రాధిక తెలిపారు. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న అక్షయ్ గురువారం ఉదయం కాలనీ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో పురుగుల మందు తాగి తండ్రికి సమాచారం అందించాడు. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుని భార్య సుప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

బజార్‌హత్నూర్(బోథ్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని భూతాయి(కే) గ్రామానికి చెందిన రైతు పెందూర్ లక్ష్మణ్ (56) గురువారం ఉదయం పశువులను తోలుకురావడానికి చందునాయక్ తాండ వైపు వెళ్లాడు. పద్వల్ సుభాష్‌కు చెందిన మొక్కజొన్న చేనులో వెతుకుతుండగా అడవిపందుల బెడద తప్పించడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ జీఐ వైరు కాలికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 25న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మావల గ్రామానికి చెందిన మమ్మద్ షరూఫ్‌ఖాన్ (28) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించేందుకు కుటుంబ సభ్యులను తరచూ డబ్బులు అడిగేవాడు. నిరాకరించడంతో మనస్తాపం చెందాడు. ఫిబ్రవరి 25న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి మహ్మద్ రజాక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు.

వివాదాస్పద స్థలంలో అనుమతి లేదు



వీడీసీ సభ్యులతో చర్చిస్తున్న అదనపు కలెక్టర్

దస్తురాబాద్: మండల కేంద్రంలోని కొమురంభీం చౌరస్తా సమీపంలో వివాదాస్పద స్థలంలో నిర్మాణాలకు ఎవరికీ అనుమతి లేదని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఎస్పీ గంగారెడ్డి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీడీసీ, ఆదివాసీ సంఘం నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. వివాదాస్పద స్థలంలో గుర్తుతెలియని వ్యక్తులు బాల హనుమాన్ విగ్రహం ప్రతిష్ఠించడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొనే అవకాశం ఉంది. దీంతో ఇరువర్గాలతో శాంతి చర్చలు జరిపారు. ఆదివాసీలకు మండల కేంద్రంలో స్థలం కేటాయిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. అప్పటి వరకు వివాదాస్పద స్థలంలోకి ఎవరూ వెళ్లకుండా 145 సెక్షన్ విధించి, ఆ భూమిని పోలీసులకు అప్పటించనున్నట్లు తెలిపారు. ఈ స్థలంలోకి ఏ వర్గం వెళ్లినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ సర్ఫరాజ్ నావాజ్, ఖానాపూర్ సీఐ బి.మోహన్, ఎస్సై ఎండీ.యాసిర్ ఆరాఫత్, ఆదివాసీలు, వీడీసీ భ్యులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి

తలమడుగు(బోథ్): చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ధనశ్రీ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన రేపని లస్మన్న (31) బుధవారం ఉదయం చేపలు పట్టడానికి ఉండం గ్రామ శివారులోని నల్లగుండ్ల వాగులో చేపలు పడుతుండగా అక్కడ ఉన్న విద్యుత్ మోటార్ ద్వారా నీటిలోకి విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య రేపని గౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.